

ఎగువ బండపల్లిలో చిరుత కలకలం

- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఎగువ బండపల్లి పరిసరాల్లో చిరుత సంచారం కలకలం రేపింది. గురువారం పంట పొలాలలో సంచరించడంతో ఆ గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేకలు, ఆవులు, గొర్రెలు, బర్రెలు మేతకు తీసుకువెళ్లాలంటే కాపర్లు భయభ్రాంతులకు గురవుతున్నారు. రైతులు తమ పొలం వద్దకు వెళ్లాలన్న భయపడుతున్నారు. చిరుత మొదటిగా లక్కిరెడ్డిపల్లి మండలం మద్దిరేవుల వంక సమీపంలోని మామిడి తోటలో కనిపించిందని రైతులు చెబుతున్నారు. చిరుత తిరిగి బండపల్లి, చిట్లూరు, ఏకిలపల్లి గ్రామాలలో సంచరిస్తోందని కాపర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని చిరుతను బంధించాలని కోరుతున్నారు.

3,559 ఎకరాల్లో పంట నష్టం

కడపలో 3,316, అన్నమయ్యలో 243 ఎకరాలు

అత్యధికంగా నేలకొరిగిన వరి



రాజంపేటలో నేలకొరిగిన వరి

జిల్లాలో అల్పపీడన ద్రోణి అపార నష్టాల్ని మిగిల్చింది. కడప, అన్నమయ్య జిల్లాలో 18 మండలాల పరిధిలో 3,559 ఎకరాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యధికంగా వరి, వేరుశనగ, మినుములు, జొన్న పంటలపై ప్రభావం చూపించింది. కడప జిల్లాలోని 12 మండలాల్లోని ఐదు రకాల పంటలు ప్రకృతి కన్నెర్రకు గురయ్యాయి. అల్పపీడన ద్రోణి ధాటికి ఉభయ జిల్లాల్లోని వ్యవసాయ పంటలకు వాటిల్లిన నష్టాన్ని వ్యవసాయశాఖ 33 శాతంపైగా నష్టపోయిన పంటలను ప్రైమరీ ఎన్యూమరేషన్ చేశారు. పూర్తి స్థాయిలో నష్టపోయిన పంటలను పరిగణలోకి తీసుకుని ఎన్యుమరేషన్ చేస్తే పంట నష్టాల్ని అంచనా వేసినట్లు అవుతుందని చెప్పవచ్చు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లో 3,559 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. నాలుగు రోజుల కిందట బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ధాటికి కడప జిల్లాలో 3,316 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 243 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ ఎన్యూమరేషన్ చేసింది. కడప జిల్లాలోని 36 మండలాల పరిధిలోని కమలాపురం, వల్లూరు, ఒంటిమిట్ట, కలసపాడు, సిద్ధవటం, బి.కోడూరు, చెన్నూరు, పోరుమామిళ్ల, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, చాపాడు, కడప మండలాల పరిధిలోని 52 గ్రామాలకు చెందిన 1540 మంది రైతులకు చెందిన వరి, వేరుశనగ, మినుములు, జొన్న, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కడప జిల్లాలో అత్యధికంగా 2,978 ఎకరాల్లో వరి, 51.87 ఎకరాల్లో వేరుశనగ, 301 ఎకరాల్లో మినుములు, 37.05 ఎకరాల్లో జొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు పంటల్లో నీరు నిలిచింది. అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, చిట్వేలి, నందలూరు, పెనగలూరు, రాజంపేట, పీలేరు, టి.సుండుపల్లి మండలాల పరిధిలోని 23 గ్రామాలకు చెందిన 138 మందికి చెందిన 243 ఎకరాల్లో వరి, వేరుశనగ, పంటలకు నష్టం వాటిల్లింది.

నేలకొరిగిన ఉద్యానం

ఉద్యాన పంటలకు సంబంధించి 1,568 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఉల్లి పంటలకు అత్యధిక నష్టం వాటిల్లింది. జిల్లాల్లోని ముద్దనూరు, తొండూరు, దువ్వూరు, యర్రగుంట్ల, వీరపునాయునిపల్లి, వేంపల్లి మండలాల పరిధిలోని 27 గ్రామా లకు చెందిన 825 మంది రైతులు 1,568 ఎకరాల్లో ఉద్యాన పంటలకు పంట నష్టం వాటిల్లింది. పూర్తి స్థాయి ఎన్యూమరేషన్ నాటికి సుమారు రెండు వేల ఎకరాలకు నష్టం చేరుకునే అవ కాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఉల్లి పంట వందలాది ఎకరాలు నేల కొరిగింది. బొప్పాయి, నిమ్మ, వంగ, మిరప, టమో టా, కర్బూజ, ఉల్లి పంటలు నష్టపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభు త్వ ఆదేశాల మేరకు ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన పంట నష్టాలను 33 శాతంపైగా నష్టాలను అంచనా వేయడం తెలి సిందే. దెబ్బతిన్న పంటలను పూర్తి స్థాయిలో ఎన్యూమరేషన్ చేస్తే రెట్టింపు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. రైతు ప్రభుత్వమని ప్రచార హోరు సాగిస్తున్న నాయకత్వం ద్రోణి బారిన పడిన రైతులందరికీ పరిహారం అందించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పపెంట గ్రామంలో ఇటీవల కురిసిన వర్షం కారణంగా దెబ్బతిన్న వరి పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎ. నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎక్కడైనా వరి పంటలో నీరు నిల్వ ఉంటే బయటికి పంపాలని తెలియజేశారు. అంతేకాకుండా వాలిపోయిన వరి పంటను నిలబెట్టి జడ మాదిరిగా కట్టుకోవాలని ఆయన అన్నారు. ఈ వాతావరణానికి పాము తెగులు వచ్చే ప్రమాదమున్నందున రైతు సోదరులు ఎక్సోనా జూల్ అనే మందును రెండు మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలియ జేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డాక్టర్ కె.ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రామ్మోహన్ రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు

సిద్ధవటం: మండల వ్యాప్తంగా 2,574 ఎకరాల్లో వరి పంట సాగైందని, వర్షానికి 57 ఎకరాలు నష్టం వాటిల్లిందని వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో పూర్తిస్థాయి నష్టం అంచనా వేసి జిల్లా, రాష్ట్ర ఉన్న అధికారులకు నివే దిక సమర్పిస్తామని తెలిపారు. జంగాలపల్లె రెవెన్యూ గ్రామంలోని వరి, వేరుశనగ పంటను పరిశీలించామని, నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.

కమలాపురం టౌన్ : మండలంలోని తుపాను కారణంగా కురిసిన వర్షానికి లేత దశలో ఉన్న మినుము, పెసర మొదలగు పంట పొలాలు నీటి మునిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖరీఫ్ మిగిల్చిన కష్టాలు మరువకముందే రబీలో సాగుచేసిన మినుము, పెసర తదితర పంటలు నీట మునిగి రైతులకు మరోసారి నష్టాన్ని మిగిల్చాయి. పలు గ్రామల్లో వందలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లి రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం చేకూరింది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చెన్నూరు : జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా వరి, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లిందని, తక్షణమే జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని ఇవ్వాలని ఎఐప రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి తెలిపారు గురువారం చెన్నూరు, ఖజీపేట మండలం చెన్న ముక్కపల్లి పంచాయతీ ములపాక, దౌళతాపురం గ్రామాలలో తుపాన్‌తో నష్టపోయిన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. జిల్లాలో పెన్నా పాపాఘ్ని నదీ పరివాహక ప్రాంతాల్లో బోరు బావుల కింద వేలాది ఎకరాలు వరి కోత దశకు వచ్చిందని పేర్కొన్నారు. ఈ తుపానుతో అన్న దాతలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. పంట నష్టాల నమోదు నిబం ధనలు సవరించి పంట ఏ మేరకు నష్టం జరిగినా ఎన్యుమరేషన్ చేసి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. నష్టాల నమోదులో కౌలు రైతుల పేర్లనే నమోదు చేయాలన్నారు. ఉద్యాన, వాణిజ్య పంటలకు కూడా ఇన్ పుట్స్ సబ్సిడీ పెంచాలని కోరారు. ఈ పరిస్థితుల్లో రైతులు, కౌలు రైతుల పంట రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుల సుబ్బారెడ్డితో పాటు బాధిత రైతులు పాల్గొన్నారు.



చాపాడు : నీట మునిగిన వేరుశనగ పంట



చెన్నూరు : తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

మున్సిపల్ ఉపాధ్యాయుల

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు ఇదే విద్యా వ్యవస్థలో భాగంగా ఉన్న మున్సిపల్ టీచర్లకు మాత్రం వర్తించడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. గురువారం సాయంత్రం కడప డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్స్‌లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరని 3, 4, 5వ తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఇఒ పోస్టులు ఇవ్వాలన్నారు. మున్సిపల్ టీచర్ల పిఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలలో నిరుపయోగంగా పడి ఉన్నాయని తెలిపారు. జీతాల నుండి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమ చేసేందుకు గాని, ఖాతాలలో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించు కునేందుకు గాని అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఎన్నిమార్లు ప్రాతినిధ్యం చేసినా పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. మున్సిపల్ టీచర్ల డిమాండ్లను వెం టనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి.రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్య మేరి, నాయకులు కృష్ణారెడ్డి, మేరీ ప్రసన్న, దత్తు, కరీముల్లా, కేదార్నాథ్, హిఫాజతుల్లా, బాబు, మహమ్మద్ ఆసిఫ్, విశ్వనాధ్, హమీద్ పాల్గొన్నారు.



కడప డిఇఒ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

నిరంతర పర్యవేక్షణ చేయండి

ప్రజాశక్తి - కడప : బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. జిల్లాలో బుధవారం నుంచి కురిసిన వర్షాల కారణంగా అవాంఛనీయ సంఘటనలు, నష్ట వివరాలపై జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారుల వరకు గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళ, బుధ వారాలు వర్షాలు కురుస్తున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఒకటి రెండు చోట్ల పాత మిద్దెలు వర్షానికి తడిసి కొంత మేర పడిపోయాయని పేర్కొన్నారు. జిల్లా లోని రిజర్వాయర్లకు చేరుతున్న నీటి మట్టాన్ని నిరంతరం గమనిస్తూ ఉండాలని, చెరువులు, వాగులు వంకలు, కాలువల గట్లు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వాటిపై 24/7 నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా ఏర్పాటు చేశామన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అట్లూరు : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తామని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు ఆర్.నరసింహులు, సి.కంచిరెడ్డి పేర్కొన్నారు. గురువారం బద్వేల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా నరసింహులు, కంచిరెడ్డి, గౌరవాధ్యక్షులుగా ఇ.కొండయ్య, సహాధ్యక్షులు ఎస్.వీరయ్య, జి.నిర్మల ప్రధాన కార్యదర్శి చిట్టెం కంచిరెడ్డి, ట్రెజరర్ జి.గురు మోహన్ కార్యదర్శులు ఎస్.శ్రీరామ్, ఎన్. నాగసుబ్బయ్య, వరలక్ష్మి, ఈశ్వర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సి.కంచిరెడ్డి, ఆర్. నరసింహులు, బి.శంకరయ్య, జి.వెంకటసుబ్బారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్. అయ్యవారు రెడ్డి, సభ్యులు డి.సుధాకర్, పి.నాగేశ్వరరావు లు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఎన్నికల పరిశీలకులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కమార్, ఎన్నికల అధికారిగా ఎస్.ఓబుల్ రెడ్డి వ్యవహరించారు.

కడప, విశాఖపట్నం మ్యాచ్ డ్రా

ప్రజాశక్తి - కడప : ఎసిఎ అండర్- 14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖపట్నం మొదటి ఇన్నింగ్స్‌లో 39.0 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 234 పరుగులు చేసింది. ఆ జట్టులోని రామ్ చరణ్ 80, వినోద్ 52, తమన్ రెడ్డి 51 పరుగులు చేశారు. కడప జట్టులోని సాయి కృష్ణ చైతన్య రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 39.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. లోకేష్ 33, యోగాంజనేయ 23 పరుగులు చేశారు. విశాఖపట్నం జట్టులోని ప్రఖ్యాత్ వర్మ రెండు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

మున్సిపల్ కార్మికులను తొలగిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

నగరంలో అడిషనల్, కోవిడ్-19 కార్మికులను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో సమావే శమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అడిషనల్, కోవిడ్-19 కార్మికులు 430 మందిని తొలగిస్తున్నట్టు కాంట్రాక్టర్లకి సర్కులర్ ఇచ్చినట్లుగా తెలుస్తుంది అన్నారు. ఉదయం కార్మికులు విధులకు వెళ్లిన సందర్భంగా మీ పేర్లు గూగుల్ మాస్టర్‌లో లేవు, మిమ్మల్ని తొలగించారు అని చెప్పారని అన్నారు. మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రెస్ మీట్‌కి సిద్ధమవుతున్న తరుణంలో మేయర్ సురేష్ బాబు కలుగజేసుకుని తాము ఎవరిని తొలగించట్లేదని ఆటోలు నిలిపివేసినటువంటి కార్మికులను మాత్రమే తొలగిస్తామని చెప్పారన్నారు. అందరిని కొనసాగిస్తామని నగరపాలక సంస్థ ఎంహెచ్ఒ తెలిపారని పేర్కొన్నారు. కార్మికులను విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తే మున్సిపల్ యూనియన్, సిఐటియుగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ నాయకులు కంచుపాటి తిరుపాల్, సుంకర రవి, ప్రకాష్, సుంకర కిరణ్, ఆదాము, నాగరాజు, దస్తగిరమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

'పెన్నా'కు భారీగా నీటి ప్రవాహం

ప్రజాశక్తి-చెన్నూరు : బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా కడప, నంద్యాల జిల్లాలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో కుందూ, పాపాఘ్ని, వక్కిలేరు, చిన్నపాటి వంకల నుంచి పెన్నా నదిలోకి వరద నీరు చేరింది. గురువారం సాయంత్రానికి చెన్నూరు వద్ద 38, 500 క్యూసెక్కులు వరద నీరు పెన్నా నది నుంచి దిగువ ఉన్న సోమశిల జలాశయంలోకి వరద నీరు ప్రవహిస్తోంది. చిత్రావతి పెన్నా నది అనుసంధానంగా నిర్మించిన గండికోట జలాశయం నిండడంతో అక్కడ నుంచి మైలవరం జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. మైలవరం జలాశయం గేట్లెత్తి పెన్నా నదిలోకి వదిలారు. ఆ నీరు వల్లూరు మండలం ఆదినిమాయపల్లి ఆనకట్ట నుంచి పెన్నా నది ద్వారా చెన్నూరు మీదుగా సోమశిల జలాశయంలోకి వెళ్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఫలితంగా బుధవారం రాత్రంతా భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం తీరం దాటడంతో రైతులు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చెన్నూరు వద్ద పెన్నా నదిలో భారీగా నీటి ప్రవాహం పెరుగుతుండడంతో నదిలో ఎవరు దిగకుండా రెవెన్యూ పోలీసులు నిఘాపెట్టారు.

మానవతా విలువలు పెంపొందించుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆకాంక్షించారు. ఎస్‌పి క్యాంప్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అని అన్నారు. అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా వాల్మీకి మహర్షి సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, జిల్లా పోలీసు కార్యాలయం ఎఒ జ్యోతి, సిబ్బంది, ఆర్ఐలు ఆనంద్, టైటాస్, శ్రీశైలరెడ్డి, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్ పాల్గొన్నారు.

పీజీ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో నేరుగా ప్రవేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రవేశాల సంచాలకులు(డిఒఎ) డాక్టర్ లక్ష్మీప్రసాద్ పర్యవేక్షించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 25 కోర్సులకు ఏపీపీజీసెట్- 2024 అర్హత సాధించిన అభ్యర్థుల వారి సర్టిఫికెట్లను డాక్టర్ వి రామకృష్ణ, డాక్టర్ ఎన్ గణేష్ నాయక్ పరిశీలించారు. ఈ ప్రవేశాలు ఈనెల 21 వరకు కొనసాగుతాయని డైరెక్టర్ తెలిపారు.

గ్రామాలాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి-కాశినాయన : గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని టిడిపి మండల నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు గురువారం పల్లె పండుగలో భాగంగా ఆయన మండల కేంద్ర మైన నరసాపురంలోని దళితవాడలో ఏర్పాటు చేయబోయే సిమెంటు రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం చెత్త డబ్బాలు గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్ర అభివృద్ధి కోసమే పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీకి రూ.10 నుంచి రూ. 15 లక్షలు సిసి రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడ రోడ్లు రోడ్లు అవసరమవుతాయో అక్కడ నిర్మిస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుమారుడు రితేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 17 పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఉప్పలూరు, వంపాడు గ్రామాలలోనూ ఆయన సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు కార్యక్రమంలో నర్సాపురం సర్పంచ్ ఖాజావలి, ఉప్పలూరు టిడిపి నాయకులు పోలిరెడ్డి, పిఆర్‌జెఇ బాల పుల్లయ్య, ఎపిఒ జయరాముడు, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్ర, ఉపాధి టిఎలు అబ్దుల్ చంద్రశేఖర్, నర్సాపురం ఫీల్డ్ అసిస్టెంట్ వలి, టిడిపి నాయకులు కొండ నరసింహారెడ్డి, కోడిగుడ్లపాడు నర్సిరెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న టిడిపి నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి

రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కాశినాయన)



రోడ్డుపై వరినాట్లు వేస్తున్న సిపిఎం నాయకులు

పోరుమామిళ్ల పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆగిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి భైవర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని ప్రధాన రహదారి వద్ద రోడ్డుపై ఉన్న గుంతలో వర్షపు నీటిలో వరి నాట్లు వేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ. 25 కోట్లతో సిసి రోడ్లు మంజూరైందని పేర్కొన్నారు. కొంత మేర పనులు చేసి తరువాత ఆపేశారన్నారు. పనులు ఆపేయడంతో పట్టణంలో ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయాలుగా మారాయని పేర్కొన్నారు. చాలా స్కూటరిస్టులు, పాదాచారులు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఆగిన పనులు మళ్లీ మొదలుపెట్టి ప్రజలను ప్రమాదాల బారిన తప్పించాలని కోరారు. ప్రారంభించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బీబీ, సుందరయ్య, రవి, గురయ్యా, రత్నం పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి-చెన్నూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులు పాటు కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి రైతులు శాస్త్రవేత్తల సలహాలను పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్రం కో- ఆర్డినేటర్ డాక్టర్ కె.అంకయ్య కుమార్ సూచించారు. మండలంలో దెబ్బతిన్న పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న కమతం కలిగిన రైతులు పడిపోయిన వరి కుదుర్లను నిలబెట్టి కట్టుకోవచ్చు అన్నారు పొలాలలో అధికంగా ఉన్న నీటి నిల్వలను కాలువల ద్వారా తీసివేయాలని తెలిపారు. ఒక లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారి చేయడం వల్ల విత్తనం రంగు మారదని, మొలకలు రాకుండా ఉంటాయని వివరించారు.

సబ్బుల తయారీలో శిక్షణ

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలోని స్థానిక ఆర్తి ఉమెన్స్ సెంటర్‌లో మహిళలకు అందిస్తున్న శిక్షణలో భాగంగా గురువారం ఆర్గానిక్ బాత్ సోప్ తయారీ లో శిక్షణ ఇచ్చారు. మహిళలు, బాలికలు స్వయం ఉపాధి పొంది, మహిళల ఆదాయాన్ని పెంపొందించే విధంగా కొన్ని రోజుల నుంచి వివిధ రకాల శిక్షణలను మహిళలకు ఆర్తి ఉమెన్ సెంటర్ ద్వారా అందిస్తున్నారు. శిక్షణలను కడప నగరంలోని మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్తి హెూమ్ ప్రెసిడెంట్ పుచ్చలపల్లి సంధ్య, సెక్రటరి దుర్గా కుమారి తెలిపారు. కార్యక్రమంలో నాగార్జున డిగ్రీ కాలేజ్, శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, ఆర్తి స్కూల్ బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్



బాధ్యతలు చేపడుతున్న నూతన కమిషనర్ మనోజ్‌రెడ్డి

నగరపాలక సంస్థ కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కడపను అభివృద్ధి పథకంలో నడిపిస్తానని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుకు వెళతానని చెప్పారు. డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులతో సమీక్ష చేసి మెరుగైన ఫలితాలు సాధిస్తామని తెలిపారు. వర్షాలు వచ్చినప్పుడు నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంచి నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. నీటి కొరత రాకుండా ఏమి చేయాలనే విషయంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కార్పొరేషన్ లో ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆక్రమణలు జరిగి ఉంటే అధికారులతో రివ్యూ చేసి భూములను వెనక్కి తీసుకుంటామని తెలిపారు. **నగరంలో పర్యటన..** కమిషనర్ ఎస్.మనోజ్ రెడ్డి విధుల్లో చేరిన వెంటనే నగరంలో పర్యటించారు. గురువారం కోటిరెడ్డి సర్కిల్, కోర్టు వద్ద నుంచి ఆర్‌టిసి సర్కిల్, వై జంక్షన్ వద్ద నుంచి అప్సరా సర్కిల్, చిన్న చౌక్, కొండాయిపల్లి ప్రాంతాలను ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. కోటిరెడ్డి సర్కిల్ వద్ద నిర్మించినటువంటి డ్రెయినన్ నిర్మాణ పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయవలసిందిగా ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కోర్టు వద్ద నుంచి ఆర్‌టిసి సర్కిల్ వరకు నిర్మిస్తున్నటువంటి డ్రెయినేజీ పనులను పరిశీలిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

కన్వర్షన్ చేయకుండానే అక్రమ లే అవుట్లు

- మామూళ్ల మత్తులో అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- మోసపోతున్న ప్లాట్ల కొనుగోలుదారులు

ప్రజాశక్తి - సిద్ధవటం

మండల పరిధిలో వ్యవసాయ భూమిని కొందరు యజమానులు వ్యవసాయేతరగా మార్పు చేయకుండానే లే అవుట్లు, వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి కొద్ది నెలలుగా వెంచర్లు పుట్టగొడుగుల్లాగా వెలుస్తున్నాయి. భూ మార్పిడి జరగని లేఅవుట్లను కొందరు ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అక్రమ లే అవుట్ల యజమానులకు నోటీసులు జారీ చేసింది. వ్యవసాయ భూములను వ్యవసాయతర భూములుగా మార్పు చేసిన తరువాతే ప్లాట్లు ఏర్పాటు చేసి కొనుగోలు దారులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ లే అవుట్ల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు. అక్రమాలు జరిగినా అధికారులు జరిమానాలు వేయకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శ నెలకొంది. ముడుపుల మాయతోనే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. కనుమలోపల్లె - మాధవరం జాతీయ రహదారిలోని చర్చి సమీపాన, చాముండేశ్వరి పేట గ్రామ సమీపాన, వాసవి కళాశాల, భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో భాకరాపేట - సిద్ధవటం ప్రధాన రహదారిలోని 11వ బెటాలియన్ ఒకటవ గేటు, మూడవ గేటు సమీపంలో లే అవుట్లలో ప్లాట్ల కొనుగోలు దారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వెంచర్ల యజమానులు భారీగా సొమ్ము చేసుకుంటుంటే సంబంధత అధికారులు మాత్రం ముడుపుల మాయలో పడి అవేమి పట్టనట్లు ఉండటంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే తప్ప, వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూమిగా మార్పు జరగకుండానే పుట్టగొడుగుల మొలుస్తున్న అక్రమ లే అవుట్ల ఆగడాలు ఆగవని పలువురు బహిరంగంగానే పేర్కొంటున్నారు.



మాధవరం-1లోని భారత్ పెట్రోల్ బంద్ వద్ద ఏర్పాటు చేసిన కన్వర్షన్ చేయని ప్లాటు

రోడ్లపై వర్షపు నీరు.. అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వర్షపు నీరు నిలిచి పోయింది. వాహనదారులు, ప్రజలు, దుకాణాదారులు చాలా అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల నుండి వర్షం కురవడంతో వర్షపు నీరు అంతా ప్రధాన రహదారులపై నిలిచిపోతోంది. కడప, పులివెందుల, రాయచోటి రోడ్డు వెంబడి నీరు నిల్వ ఉండడంతో దుకాణాల్లో వ్యాపారం చేసుకొనే వారు ఇబ్బందులకు లోను అవుతున్నారు. కొన్ని చోట్ల డ్రయినేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు అంతా ఎటు పోలేక రహదారిపైనే నిలిచిపోయింది. బురదగా తయారవడంతో కనీసం నడవలేని పరిస్థితి. రాజీవ్ నగర్ కాలనీలో సిమెంటు రోడ్లు వేయని కారణంగా కాలనీ అంతా బురదతో నిండిపోయింది. ఎక్కడ బురదలో కింద పడిపోయి ప్రమాదం జరుగుతుందోనని ఆ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిసి రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు రోడ్లపై నిల్వ ఉన్న వర్షపు నీరు లేకుండా చేసేందుకు మట్టిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



పులివెందుల రోడ్డులో దుకాణాల ముందు నిల్వ ఉన్న వర్షపు నీరు

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న వాల్మీకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కదిరి రోడ్డులో వాల్మీకి విగ్రహాన్ని వాల్మీకులంతా కలిసి ఏర్పాటు చేశారు. విగ్రహానికి పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. వాల్మీకులతోపాటు పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వాల్మీకులందరికీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు అంబకపల్లె నారాయణస్వామి, అంబకపల్లె బాలుడు, మేకల విశ్వనాథ్, దాసరి చంద్రమౌళి, రామాంజనేయులు, దాసరి శేఖర్, నాగరాజు, ఆదినారాయణ, రమేష్, ఎస్ నాగరాజు పాల్గొన్నారు.

వేంపల్లె : కవులు కారణ జన్ములని, అలాంటి కవులలో ఆదికవి వాల్మీకి భారతీయ వాంగ్మయంలో రామాయణం ఆది కావ్యమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని గురువారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వినయ్, సుబ్బరాయుడు, రాజా, వేమయ్య, నాగరాజు, వెంకటేష్, మాష్, బద్రి, రవి, మదార్ పాల్గొన్నారు.

సింహాద్రిపురం : వాల్మీకుల ఆత్మగౌరవం పెంచే విధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే ఆదినారాయణ తెలిపారు. సింహాద్రిపురం బుడ్డయ్యపాలెంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్రహ్మంగారిమఠం : బ్రహంగారి దేవాలయం వద్ద ఉన్న రామాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శోభాయాత్ర, కోలాటం, మాడ వీధులలో వాల్మీకి చిత్రపటం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

వైవీయూలో..

కడప అర్బన్ : ఆదికవి వాల్మీకి మహర్షి సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకమని యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ పరిపాలన భవనంలో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించ కుని ఆయన చిత్రపటానికి విసి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన వాల్మీకి రామాయణాన్ని భారతీయులు ప్రామాణికంగా తీసుకుంటారాన్నారు. ప్రపంచంలో నదులు, పర్వతాలు ఉన్నంత కాలం రామాయణం చదువుతారు తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి జీవితం ఎంతో విలక్షణమైందని వివరిస్తూ ముఖ్యమైన విషయాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో హ్యుమానిటీస్ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య చంద్రఓబుల రెడ్డి, ఆచార్య వి.రామకృష్ణ, బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప: ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి), కడప ఎన్ఎస్ఎస్ విభాగం, తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రామాయణ ఇతిహాసాన్ని మనకు అందించిన వాల్మీకి ఒక ఆదర్శ గురువు, ఆయన చూపిన మార్గంలో నడవడం మన కర్తవ్యం అని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి శివరామకృష్ణ, డాక్టర్ నాగరాజు లీలా వర్ధిని, తెలుగు అధ్యాపకులు డాక్టర్ సుందరేశ్వర రావు డాక్టర్ పొదిలి నాగ రాజు, డాక్టర్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వికాస్' హరికృష్ణ ఆధ్వర్యంలో..

వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో యువగలం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగ నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని, ఇది తెలుగుదేశం బిసిలకు ఇచ్చిన గౌరవం అని తెలిపారు. లోకేష్ ఇచ్చిన ప్రతి హామీని తెలుగుదేశం ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని దానికి ఇదే నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో 22వ డివిజన్ ఇన్‌ఛార్జి పుట్టబోయిన శ్రీనివాసులు, టిడిపి నాయకులు అనిల్,రాజు,ఉదయ్ పాల్గొన్నారు.

నిఘా నీడలో సింహాద్రిపురం

ఈ నెల చివరికి ప్రధాన కూడలి, ప్రతి షాపు వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురం ఈనెల చివరికి నిఘా నీడలోకి వెళ్లనుంది. ప్రధాన కూడలి, ప్రతి దుకాణం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆ మేరకు ఎస్ఐ తులసి నాగప్రసాద్ వ్యాపారులకు సూచించారు. మండల కేంద్రంలో ఉన్న దాదాపు 110 దుకాణాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు యాజమానులు అంగీకరించారు. ఈనెల చివరి నాటికి ప్రతి దుకాణం వద్ద అమర్చుకుంటామని వ్యాపారులు తెలిపారు. ఇటీవల ప్రధాన కూడలి, ఆర్టీసీ బస్టాండ్, వారపు సంత జరిగే ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు, పర్సులు, ఇతరత్రా వస్తువులు చోరీకి గురయ్యాయి. వీటికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు కూడా అందాయి. స్పందించిన పోలీసులు చోరీల నివారణకు నిఘా పెట్టాలనే ఉద్దేశ్యంతో సిసి కెమెరాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులు కూడా సూచించారు. అధికారులు సైతం ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు తెలిసింది.

చోరీల నివారణే లక్ష్యంగా చర్యలు..



మండల కేంద్రమైన సింహాద్రి పురంతో పాటు ఇతర గ్రామాల్లో చోరీల నివారణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగానే ప్రతి దుకాణం వద్ద సిసి కెమెరా ఏర్పాటు చేసుకోవాలని చెప్పగానే వ్యాపారులు అంగీకరించారు. వారపు సంత, రద్దీ ప్రాంతాల్లో కూడా సిసి కెమెరాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. **- తులసి నాగ ప్రసాద్, ఎస్ఐ, సింహాద్రిపురం**

సూపర్‌సిక్స్ పాలసీలు అమలు చేస్తాననడం సిగ్గుచేటు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకే దిక్కు లేదు.. ఇంకా సూపర్ సిక్స్ పాలసీలు అమలు చేస్తామని చెప్పడం సిగ్గుచేటని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమ్మకు అన్నం పెట్టని ప్రబుద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుంది చంద్రబాబు ప్రభుత్వ వైఖరి అన్నారు. ఉట్టి కెక్క లేనమ్మ స్వర్గానికి ఎగురుతానన్నట్లుంది అన్నారు. రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు తెంచి 20 లక్షల మందికి ఉద్యో గాలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఎన్నికల సంద ర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో సామాజిక ఫించన్లు పంపిణీ హామీ మాత్రమే అమలు అవుతోందని తెలిపారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచి తంగా 3 గ్యాస్ సిలిండర్లు, 19-59 సంవత్సరాల వయసు గల మహిళలకు నెలకు రూ.1,500, బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు 50 సంవత్సరాలకే ఫించన్లు అనేవి అమలు కాకుండానే, ఇప్పుడు సూపర్ 6 పాలసీలట అని ఎద్దేవా చేశారు. 20 లక్షల ఉద్యోగాలట అన్నారు. ఎవరిని నమ్మించడానికి ఈ పిట్టల దొర ప్రసంగాలు అన్నారు. ఒక్కో ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తారట అని చెప్పడం కన్నా.. ఒక్కో ఇంటికి ఒక తాగు బోతు ను తయారు చేస్తామని చెబితే బాగుం టుం దన్నారు. ఇప్ప టికైనా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని కాం గ్రెస్ డిమాండ్ చేస్తు న్నట్లు తెలిపారు.

రెండ్రోజులపాటు వార్డు మెంబర్లకు శిక్షణ

- ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామానుజం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వార్డు మెంబర్లకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామానుజం తెలిపారు. శిక్షణ స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో ఉంటుందన్నారు. శుక్ర, శనివారాల్లో ఏర్పాటు చేశామన్నారు. గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు మెంబర్లు తప్పక హాజరుకావాలని కోరారు. గ్రామ పంచాయతీ నిధులు, వినియోగం, విధులు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణ గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. శిక్షణకు ఆయా పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు తప్పక హాజరుకావాలని రామానుజం కోరారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి సుభాషిణి

కోత దశలో మురుగు నీరు బయటకు పంపాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఉల్లి పంట కోత దశలో ఉన్నప్పుడే మురుగునీరు బయటకు పంపాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్ఎస్‌వి సుభాషిణి సూచించారు. మండలంలోని చిరాజుపల్లె, దండుపల్లె, తిప్పలూరు గ్రామాల్లో గురువారం ఆమె ఉల్లి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడ్డను పీకిన తర్వాత ఒక లీటరు నీటికి ఒక గ్రాము థయోఫినేట్ మిథైల్ లేదా ఒక గ్రాము కార్బెండిజం లేదా ఒక మిల్లీ గ్రాము ప్రోపికొనకొల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల గడ్డ కుళ్లును నివారించవచ్చని తెలిపారు. వీలైనంత త్వరగా గడ్డలను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి నిల్వ ఉంచుకొని మార్కెటింగ్ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రెడ్డయ్య, సహాయక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

ప్రజాశక్తి - ఖాజీపేట

వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి, పంట నష్ట నివేదికను ప్రభుత్వానికి సమర్పించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎఒ నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని త్రిపురవరం గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కెవికె కార్యక్రమ సమన్వయకర్త వీరయ్య, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహాదారు అంకయ్య కుమార్, సమన్వయకర్త, శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, వ్యవసాయ అధికారి నాగార్జున పంట పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.

వరి పంటలో వర్షపు నీటిని తొలగించుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

తుపాన్ తాకిడీతో వరి పంటలో అధికంగా చేరిన వర్షపు నీటిని రైతులు వెంటనే తొలగించుకోవాలని ఎఒ మ్యాగీ తెలిపారు. మండల పరిధిలోని పెద్ద గురువలూరు, రామచంద్రాపురంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటలో ఆకు ముడత తెగులు సోకుతుందని, అవసరం మేరకు పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో విఎఎ మాధవిలత, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూ రీ సర్వే గ్రామసభలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో భూ రీ సర్వే చేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ దామోదర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ రీసర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని సూచించారు. ఈనెల 18న భూదవాడ, 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మల్లేపల్లి, 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు ముడమాల, 29వ తేదీ నుండ 30వ తేదీ వరకు టి.చౌదరివారి పల్లి, అక్టోబర్ 1వ తేదీ నుండి 2వ తేదీ వరకు గొడ్లవీడు, 5వ తేదీ నుండి 6వ తేదీ వరకు గుండాపురం, 7వ తేదీ జి.నరసింహాపురం, 8వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఎగువ నేలటూరు, 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు రేకులకుంట, 19వ తేదీ డి.అగ్రహారం, 20న డి.లింగంపల్లి, 21 నుండి 23వ తేదీ వరకు దిరశవంచ, 26న డి.నరసింహపురం, 27, 28 తేదీల్లో నాగిశెట్టిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

ఇన్‌ఛార్జి మంత్రి సవితను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, బిసి సంక్షేమ శాఖ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను వేంపల్లెకు చెందిన టిడిపి నేతలు కలిసి అభినందనలు తెలిపారు. గురువారం విజయవాడలోని సచివాలయంలో ఆమెను కలిశారు. కడప పార్లమెంటు ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు మూడే రాజా నాయక్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుక్కే గణేష్ నాయక్, వేంపల్లె మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లంగి సుధాకర్‌రెడ్డి మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేశారు. వైఎస్ఆర్ జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా రావడం సంతోషంగా ఉందన్నారు.



మంత్రి సవితకు అభినందనలు తెలుపుతున్న టిడిపి నేతలు



బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

అనాథాశ్రమంలో పండ్లు, పాలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

వైసిపి మండల కన్వీనర్ తిమ్మాపురం గ్రామానికి చెందిన నడమల శ్రీధర్‌రెడ్డి తండ్రి నడమల వాసుదేవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన మనవడు నడమల అభినవ వాసురెడ్డి కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అనాథలకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. వంట నూనె, బియ్యం, మందులు ఆశ్రమ నిర్వాహకులు పాస్టర్ ఇమ్మానియేలుకు అందజేశారు..

మినీ గోకులానికి భూమిపూజ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని కసుమూరులో మినీ గోకులానికి ఎంపిడిఒ కృష్ణమూర్తి భూమిపూజ చేశారు. గురువారం ఉపాధి హామీ పథకం నిధులతో మూడు గోకులాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో పాడి రైతుల అభ్యున్నతే లక్ష్యంగా గోకులాలను మంజూరు చేసిందన్నారు. వీటిని పాడి రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం ఇసి శ్రీనివాసరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపిటిసి లక్ష్మీకాంతమ్మ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ముద్దనూరు

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిటిసి వెన్నపూస లక్ష్మీ కాంతమ్మ పేర్కొన్నారు. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలో గురువారం ఎంపిడిఒ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మేజర్ గ్రామ పంచాయతీలో రూ.92.50లక్షలు వ్యయంతో సిసి రోడ్లు, పాఠశాల ప్రహారీ నిర్మాణానికి ఎంపిటిసి, జడ్‌పిటిసి సభ్యులు బడుగు ఉమాదేవి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వీరభద్రుడు, పిఆర్ ఎఇ వినయ్‌కుమార్, ఎపిఒ గంగయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసింహులు, ఇసి ఉజ్వల్ రెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, రాజా యాదవ్, వినోద్, ఓబులేసు, ఉమా మహేశ్వరరెడ్డి, సాగర్, నాయుడు, సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

చాపాడు : మండల పరిధిలోని మడూరు, చిన్న వరదాయపల్లె, అన్నవరం గ్రామ పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం సిసి రోడ్ల నిర్మాణానికి అధికారులు, టిడిపి నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ నిధులు ఉపయోగించి సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, టిడిపి నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని నెరుసుపల్లెలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ సానే సుబ్బరామయ్య ఆధ్వర్యంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సానే రాహుల్, ఎపిఒ రవి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేముల : మండలంలోని వేల్పుల గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి, అధికారులు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భూపేష్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే ఆది, రమణారెడ్డి

ఘనంగా భూపేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బ రామిరెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి భూపేష్ తండ్రి మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డికి తినిపించారు. అనంతరం పట్టణంలో భూపేష్‌రెడ్డి పోస్టర్ ఊరేగింపు చేసి, పాలాభిషేకం చేశారు. అంతకుముందు విజయవాడలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి కలిసి కేక్ కట్ చేసి అక్కడే ఉన్న భూపేష్‌రెడ్డికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు అన్నెబోయిన కొండయ్య, న్యాయవాది సూర్య పెద్దిరాజు, జింకల బాషా, పాలూరు సుధీర్‌కుమార్ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, పొన్నతోట బ్రదర్స్ శ్రీను, మల్లి, అంబవరం రామయ్య, ఐఎల్ చిన్నా, నవీన్ రాయల్, బిర్రు సంతోష్, ఎన్‌డిఎ కూటమి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముద్దనూరు : జమ్మలమడుగు నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బ రామిరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు చింతా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ కూడలిలో చింతా శివరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సత్తార్, సాయికృష్ణ, శ్రీకాంత్ బాబు, ఆది, పెద్దమాబు, చిన్నమాబు,లక్ష్మి నారా యణ, శేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

కొండాపురం : జమ్మలమడుగు టిడిపి నియో జకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా కోడి కాండ్లపల్లె ఏసు కరుణాలయంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి గోరిశెట్టి బాబు అన్నదానం చేశారు. బాలిరెడ్డి, శివనాగిరెడ్డి, సుగు మంచిపల్లి వీర శేఖర్‌రెడ్డి, సత్య, గైబువల్లి, రోహిత్, శీను పాల్గొన్నారు.